# మంగమ్మగారు – మారుతీ డ్రైవరు

-డా.తంగిరాల మీరా సుబ్రహ్మణ్యం

"ఏమండీ! మనం కారు డ్రైవర్ని పెట్టుకుందాం" హఠాత్తుగా సరదావడింది మంగమ్మగారు.

"చెప్పా పెట్టకుండా ముందస్తు ఎన్నికలు ముంచుకు వచ్చినట్లు ఈ డ్రైవర్ని పెట్టుకునే ఆలోచన ఎప్పుడొచ్చింది?" ఆశ్చర్యపడ్డారు మంగపతిగారు.

"పోనీలెండి! ఆ రకంగా అయినా గొప్పవాళ్లతో నన్ను పోల్చారుగానీ ఇంకో వారంలో మొదటి తారీకు వస్తుందిగా. ఆసరికి డ్రైవర్ని మాట్లాడి ఉంచండి" మరో అభిప్రాయానికి చోటు లేదన్నట్లు ఖరాఖండీగా చెప్పేసిందావిడ.

"ఏం? నా డ్రైవింగ్ మీద నమ్మకంలేదా ఏమిటి?" అనుమానంగా అడిగారు.

"అయ్యో రామ. మీ డ్రైవింగ్‌కేమయిందీ? లేదంటే ఇక్కడి మనుషులకీ, జంతువులకీ ప్రభుత్వం వేయించిన రోడ్లమీద సర్వహక్కులూ ఉంటాయి కనుక దారి పొడవునా ఆపమంటూ చెయ్యి చూపి రోడ్డు దాటిన వాడినీ, వున్నట్టుండి సైకిల్ని వక్కకు తిప్పేసే కుర్రాళ్లనీ, రెండు అంగుళాల చోటు వున్నా ముందుకు దూసుకుపోయే మోటారుసైకిల్ వాళ్లనీ తిట్టుకుంటూ హైరానా పడుతున్నారుకదా అనిగానీ..." అని ఆగారు మంగమ్మగారు.

"పోనీ నువ్వు నేర్చుకోరాదూ డ్రైవింగ్? ఈ కాలం ఆడవాళ్ళు పెద్ద పెద్ద బస్సులు, ట్రాములు నడిపేస్తున్నారు చూసావుగా మీ అమెరికాలో..."

కాదు కూడదని పట్టుబట్టి కూతుళ్ల దగ్గరికి అమెరికా ప్రయాణం కట్టించినందుకు ఆర్నెల్లు అక్కడ గడిపి తిరిగి వచ్చాక కూడా ఆవిడను ఆటపట్టించడం మానలేదు మంగపతిగారు.

"అదిగో మీరే చెప్తున్నారుగా పెద్ద కార్లు, ట్రాములు అని. అల్టిమా కారో, నిస్సాన్ కారో కొన్నాక నేను నడుపుతాలెండి. ఇన్నేళ్ళు బాధ్యతలంటూ కష్టపడ్డాం. ఇప్పుడిక పిల్లలంతా జీవితంలో హాయిగా స్థిరపడ్డారని ఈమధ్యేగా కారు కొన్నాం. హాయిగా, దర్జాగా వెనుక సీట్లో కూర్చుని వెళ్లక చెమటలు కార్చుకుంటూ టెన్షన్ పడ్డం దేనికండీ? పైగా మీకు బిపి వుంది కూడా..." అనునయంగా అన్నారు మంగమ్మగారు.

ఆవిడతో వాదించి గెలవడం అంత సులువుకాదని మంగపతిగారికి అనుభవం నేర్పింది.

"సరే అలాగేకానీ" అన్నారాయన ఇకపై ఆవిడను చీరల షాపులకీ, నగల షాపులకీ తీసుకెళ్ళే పని తప్పుతుంది తనకి అనుకుంటూ.

***

ఒకటో తారీకు వచ్చింది.

అనుకున్నట్లుగానే డ్రైవర్ని కుదిర్చారు మంగపతిగారు.

పొద్దున్న పదిగంటలకల్లా వచ్చేసిన వరదరాజులు కారు బయటకు తీసుకెళ్లిపెట్టి శుభ్రంగా అద్దంలా తుడుస్తుంటే ముచ్చటపడుతూ చూసింది మంగమ్మగారు.

"ఇంకా అలాగే కూర్చున్నారేమిటండీ? తొందరగా రెడీ అవండి. ఆ డ్రైవరు కుర్రాడు మనం చెప్పినట్లుగానే ఠంచనుగా పదింటికల్లా వచ్చాడు" అంటూ భర్తను తొందర చేసింది.

"నాకిప్పుడు బయటకు వెళ్లి చేసే పని ఏం వుందని? అంతగా అయితే సాయంకాలం నువ్వు షాపింగ్‌కు వెడదువుగానీ" పేపరు చూస్తున్న మంగపతిగారు కదలకుండా కూర్చుని అన్నారు.

"ఎప్పుడూ ఏదో ఒక పనిమీద బయటకు తిరుగుతూనే వుంటారుకదా. ఏదో సుఖంగా వెళ్లి వస్తారని డ్రైవర్ని మాట్లాడితే పనులే లేవంటారేమిటండీ? ఇవాళ ఒకటో తారీకు కదా. బ్యాంకుకు వెళ్లి పెన్షన్ వేయించుకురండి పోనీ" సలహా ఇచ్చింది మంగమ్మగారు.

"ఒకటో తారీకున బ్యాంకుకు వెళితే అయినట్టే. కిటకిటలాడుతుంటారు జనం. సరే ఆ సంచీ ఇవ్వు రైతుబజారుకు వెళ్లి కూరలు తీసుకొస్తాను" తప్పనిసరిగా లేచి బయల్దేరారు మంగపతిగారు.

ఇంట్లో బోలెడు కూరగాయలు వున్నాయని గుర్తొచ్చినా మాట్లాడకుండా సంచీ అందించింది ఆవిడ 'మొదటిరోజే పని లేకపోతే ఆ డ్రైవర్ ఏమనుకుంటాడు?' అనుకుంటూ.

ఏ రోజూ సాయంత్రం ఆరుగంటలకుగానీ టీ తయారు చేయని భార్య ఆ రోజు నాలుగున్నరకే టీ అందిస్తే ఆశ్చర్యపోయారు మంగపతిగారు.

అయిదు గంటలయ్యేసరికల్లా చక్కగా ముస్తాబై కూర్చుంది ఆవిడ.

"ఆ డ్రైవర్ అబ్బాయి వచ్చే టైమవుతోంది. రెడీ అవుతారా లేదా?" అంటూ భర్తను హెచ్చరించింది.

"డ్రైవరున్నాడుగా? ఇక నేనెందుకు? నువ్వు వెళ్లి ఏవో మాచింగ్ జాకెట్టు బట్టలు కావాలన్నావుగా తెచ్చుకో" టీవీ మీద నుండి దృష్టి మరల్చకుండా అన్నాడాయన.

"బాగానే వుంది. డ్రైవరు కారు నడుపుతాడుగానీ నాకు మాచింగ్ జాకెట్లు ఎంపిక చేయడు. ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు? పదండి తొందరగా తయారై రండి" అంటూ టీవీని ఆఫ్ చేసేసింది మంగమ్మగారు.

మాట్లాడకుండా కుర్చీలో నుండి లేచారు మంగపతిగారు.

మరునాడు శనివారం. పొద్దున్న వరదరాజులు వచ్చి కారు బయటకు తీయగానే "బజారుకు వెళ్లి పూలు, కొబ్బరికాయ పట్టుకురండి" అంటూ భర్తను పురమాయించింది.

సాయంకాలం సినిమా వేసే టైముకి ఏ పకోడీలో చేసి పెట్టి టీవీ ముందు కూర్చునే వారు ఇద్దరూ.

అలాంటిది ఆ రోజు సాయంత్రం అయిదయ్యేసరికి పట్టుచీర కట్టి ముస్తాబయింది మంగమ్మ

గారు.

"ఇప్పుడీ అలంకారం దేనికి?'' అనడిగిన భర్తకు ముసిముసి నవ్వులతో సమాధానం చెప్పిందావిడ.

"వరదరాజులలు వచ్చే వేళయింది కదా అని..''

"ఎవరైనా వింటే అపార్థం చేసుకుంటారే? ఇంతకీ ఎక్కడికి వెళ్తున్నావు?'' అనడిగారు.


"నేనొక్కత్తినే వెళ్లడంలేదు. మనిద్దరం వెళ్తున్నాం వెంకటేశ్వరస్వామి గుడికి. ఇవాళ శనివారం కదా'' అందావిడ భక్తిగా.

"మొన్ననేగా సత్యనారాయణస్వామి వ్రతం అంటూ గుళ్ళో మూడుగంటలు కూర్చుని మోకాళ్ళు పట్టేసాయని, ఇకమీదట దేవుడయినా పూజ అయినా ఇంట్లోనే అని నిష్కర్షగా చెప్పావు. మర్చిపోయావా?'' గుర్తు చేసారాయన.

"ఇవాళ అలా గంటలసేపు వుంటామా ఏమిటి? ఇలా వెళ్లి అలా దర్శనం చేసుకురావడమేగా?'' అందావిడ తేలిగ్గా.

"శనివారంరోజున ఎక్కడైనా వెంకటేశ్వరస్వామి గుళ్ళో చేంతాడంత క్యూ వుంటుంది తెలుసా?





## కొత్త క్రేజ్

కొంతమందికి కొన్నిరోజులు చాలా కలిసి వస్తాయి. అలాగే ఇపుడు నేహాధుపియా టైం వచ్చినట్టుంది. ఐశ్వర్యారాయ్, రాణీ ముఖర్జీ, ప్రీతిజింతాలు ఇండస్ట్రీలో అందరి మన్ననలు పొంది టాప్ హీరోయిన్స్‌గా రాణించిన అంకం నుంచి ఇప్పుడు మరో అంకం ప్రారంభమైంది. ఇప్పుడా అంకంలో కొత్త తారలొచ్చి కలిశారు. నేహా ధుపియా, మల్లికా షెరావత్, మేఘనా నాయుడు..వీరే ఆ కొత్త తారలు. వీరిలో అత్యంత ప్రభావశీలిగా మారింది నేహా. ఇప్పుడామెని అంతా బోల్డ్ అండ్ బ్యూటిఫుల్ అంటున్నారు.




మళ్లీ కాళ్ల నొప్పులంటావ్?'' సినిమా మొదలయిందేమోనని టీవీ ఆన్ చేసి అటు చూస్తూ మరో ప్రయత్నం చేసారు మంగపతిగారు.

"మోకాళ్ల నొప్పి గురించి బెంగ పడుతున్నారా? టీవీలో సినిమా చూడలేకపోతున్నానని బాధపడుతున్నారా? గుడికి వెళ్లాలనుకున్నాక ఆగిపోకూడదుగానీ పదండి'' ఆయన లేచేదాకా వదలలేదావిడ.

"రేపు ఆదివారం కదా. ఆ డ్రైవరబ్బాయిని రావొద్దని చెప్పేస్తాను'' గుడి నుండి వచ్చాక చెప్పారు మంగపతిగారు.

"ఇలా ఆదివారాలు, సెలవులు అంటూ ఆ అబ్బాయిని చెడగొట్టకండి. మామూలు టైముకే రానివ్వండి. అంతగా అయితే కాసేపు వున్నాక వెనక్కి పంపిద్దాం'' అంది మంగమ్మగారు.

'అవురా ఈ ఆడవాళ్ళు?' అని ఆశ్చర్యపోయారాయన.

తీరా ఆదివారం వరదరాజులు వచ్చేసరికి వంటపని కూడా ముగించేసి సిద్ధమయింది మంగమ్మగారు.

"ఇవాళ గరిమెళ్ల గౌరిగారి ఇంటికెళ్లి పలుకరించి వద్దామండీ'' అంది భర్తతో.

"ఎప్పుడూ మనం వెళ్లడమేతప్ప వాళ్ళు రారనీ, వాళ్ళు వచ్చేదాకా అటువైపు వెళ్లననీ అన్నావుగా'' మంగపతిగారి జ్ఞాపకశక్తి అమోఘంగా పనిచేసింది.

"అంటే అన్నానులెండి. వాళ్లయితే ఆటోకి బోలెడు డబ్బులు పోసి రావాలి. మనకు డ్రైవర్ కూడా వున్నాడాయె. పంతాలు పడకుండా వెళ్తే సంతోషపడతారు'' అనేసిందావిడ.

"సాయంకాలం ఆ డ్రైవర్ కుర్రాడిని రావద్దని చెప్తాలెండి. ఇంట్లోనే వుందాం'' అని చంటి కుర్రాడికి తాయిలం ఆశ చూపినట్లు చెప్పింది.

***

పదిహేను రోజులు గడిచాయి.

ఎక్కడివాళ్లనూ గుర్తుకు తెచ్చుకు ఇళ్ళకు వెళ్లడం, రోజూ ఏదో ఒక పని పెట్టుకుని బజారుకు వెళ్లడం ఒక అలవాటుగా మారింది మంగమ్మగారికి.

ఇదిగో ఇప్పుడు మంగపతిగారు ఊరు వెళ్ళే పని పడింది.

"ఈ నాలుగురోజులూ ఆ వరదరాజులుని రావద్దని చెప్పమంటావా?'' అనడిగారాయన ఆవిడ ఒంటరిగా ఎక్కడికీ వెళ్లదని తెలిసిన మంగపతిగారు.

"బావుందండీ. మీరు నాలుగురోజులు పనిలోకి రావద్దని అంటే మాత్రం అతనికి రోజుకి అరవై రూపాయలు ఇవ్వడం తప్పదుకదా. రానివ్వండి మామూలు టైముకే. చూస్తాను'' అందావిడ సాలోచనగా.

అన్నట్టుగానే మంగపతిగారు ఊరికి వెళ్లారు.

వెనక వీధిలో వున్న వాయినాల వనజగారికి ఫోన్ చేసింది మంగమ్మగారు.

"మీకేదైనా బజారుకు వెళ్ళే పని వుందా వనజా! మావారు ఊళ్ళో లేరు. కారు డ్రైవర్ని పెట్టుకున్నాము. అతను పదింటికల్లా వస్తాడు. మీరు ఎక్కడికన్నా వెళ్దామంటే బయల్దేరి వస్తాను'' అనడిగింది.

వనజ 'వీలుపడదు' అనకుండా ఏదో ఒక పని కల్పించుకుని వస్తే బాగుండు, డ్రైవర్ని పనిలేదు అని వెనక్కి పంపించి ఉత్త పుణ్యానికి అరవై రూపాయలు ఇచ్చిన బాధ ఉండదు అనుకుంటూ ఉండగానే వనజ ఉత్సాహంగా అంది.

"వందనలో బోలెడు డిస్కౌంటు ఇస్తున్నారటండీ. చీరలు బాగున్నాయేమో వెళ్లి చూద్దాం. నాకూ వేరే ఏమీ పనిలేదు కూడా''

మంగమ్మగారికి నెత్తిన పాలు పోసినట్టనిపించింది.

హడావుడిగా వంటా వార్పూ ముగించి వరదరాజులు వచ్చేసరికి సిద్ధంగా ఉన్నారు.

వనజగారిని తీసుకుని వందన బట్టల దుకాణానికి వెళ్లారు మంగమ్మగారు.

ఆ రోజు మంగళవారం కావడాన షాపులో తిరుణాళ్ళలో వున్నట్లు కిటకిటలాడుతున్నారు ఆడవాళ్ళు.

ఆ రోజున ముప్ఫై అయిదు రూపాయల రవికెల బట్టలు ముప్ఫై రూపాయలకే ఇస్తారుట. వంద రూపాయల లోపు ఖరీదు వున్నచీరలు గుట్టగా పోసారు.

"ఆ...తొంభై రూపాయలకే జార్జెట్టు చీర కొనండమ్మా. నూరు రూపాయలకే చినుకు సినిమా హీరోయిన్ కట్టినలాంటి చీర కొనండి. రండి...'' అంటూ అరుస్తున్నారు ఆయా కౌంటర్ల దగ్గర వున్న సేల్స్‌మెన్.

ఒక గంట తరువాత అక్కరలేవినీ, కావాల్సినవీ అన్నిరకాలులాగి తీసి మడతలు విప్పించి అంచు కొంగు మొదలైనవి పరిశీలించి పెదవి విరిచారిద్దరూ.

ఆ అరుపులు, హడావుడిలో వుండేసరికి తల నొప్పి వచ్చింది మంగమ్మగారికి.

"ఇక వెళ్లిపోదాం వనజా. కావాలంటే సాయం

కాలం వద్దాం'' అంటూ బయటకు నడిచారు.

ఇంటికి వచ్చేసరికి ఒంటిగంట అయింది.

"సాయంత్రం ఐదుగంటలకు వచ్చేదామ్మా'' అనడిగాడు వరదరాజులు.

"ఇక ఈరోజు ఎక్కడికీ వెళ్లనులే. రేప్పొద్దున్న మామూలు టైముకే వచ్చేయ్''

ఈరోజు ఒక్కసారి అలా తిరిగి వచ్చినందుకే అరవై రూపాయలు ముడుపు కట్టినట్టు ఇవ్వాల్సిందే అని బాధగా అనుకుంటూ నీరసంగా చెప్పారు మంగమ్మగారు.

మర్నాడు ఉదయం డ్రైవరు వచ్చేలోపుగా పెద్దింటి పద్మకు ఫోన్‌చేసి షాపింగ్‌కు బయల్దేరదీసారు.

అబ్దుల్లాఖాన్ ఎస్టేట్ దగ్గర వున్న చైనా షాపుకి వెళ్లారు.

అంత పెద్ద అవసరం లేకపోయినా ఏవో కొన్ని ప్లాస్టిక్ ప్లేట్లు, డోర్ మ్యాట్స్ కొనుక్కున్నారు మంగమ్మగారు.

నాలుగురోజుల్లో మంగపతిగారు తిరిగి వచ్చారు.

"హమ్మయ్య! మీరొచ్చేసారు. ఆ డ్రైవరు కుర్రాడిని రెండుపూటలూ వూరికే వెనక్కి పంపించవలసి వచ్చింది. ఇక ఇవాల్టి నుండి మీరు వుంటారు కనుక దండగ డబ్బులు ఇస్తున్నామన్న చింత ఉండదు'' సంతోషంగా అన్నారు మంగమ్మగారు.

ఆ మాటలు వినగానే నాలుగురోజులు అటు ఇటు తిరిగి వచ్చిన బడలికకన్నా ఎక్కువ నీరసం అనిపించి కుర్చీలో కూలబడ్డారు మంగపతిగారు.

నెలాఖరు వచ్చేసరికి పెట్రోలు ఖర్చు లెక్కవేసి చూసింది.

రెండున్నర వేలు అయినట్టు తేలింది.

ఇక డ్రైవర్‌కి ఇవ్వాల్సిన జీతం పద్దెనిమిది వందలు.

అంటే మొత్తం ఖర్చు నాలుగు వేలు దాటిందన్నమాట అనుకుంటే మంగమ్మగారికి నిస్త్రాణగా అనిపించింది.

"ఏదో డ్రైవర్ని పెట్టుకుంటే దర్జాకి దర్జా, ఆయనగారికి ప్రాణానికి సుఖం అనుకున్నానేగానీ ఇలాగ వుతుందనుకోలేదు'' అంటూ బాధపడ్డాడు.

"నేనేమో రిటైరై పోయాను. నువ్వు ఇంట్లో వుండేదానివి. మనకి డ్రైవరు ఎందుకే అంటే వినక పోయావు. వాడిని ఖాళీగా కూర్చోబెట్టి జీతం ఇవ్వడానికి మనస్కరించక, లేని పనులు కల్పించుకుని మరీ తిరిగాము. మరి ఖర్చు అయిందని బాధపడి ఏం లాభం?'' అన్నారు మంగపతిగారు.

"ఇప్పుడేం చేద్దాం? మరీ నెల్లాళ్లకే మాన్పించేమంటేవాడు గొణుగుతాడు. పైగా నలుగురూ నవ్వుకుంటారు కూడా'' దిగులుగా చూసారు మంగమ్మగారు.

ఒకటో తారీకు జీతం అందుకున్న వరదరాజులు-

"ఈనెల నుండి నెలకు రెండువేలు ఇప్పించండి సార్. వేరే డ్రైవర్లు రెండువేల రెండు వందలు తీసుకుంటున్నారు'' అన్నాడు వినయంగా.

అతగాడికి జీతం ఇచ్చే పనిని మంగపతిగారికి వదిలేసింది మంగమ్మగారు.

నిరుత్సాహంగా హాలులో కూర్చుని వున్న మంగమ్మగారికి డ్రైవర్ వరదరాజులు మాటలు వినగానే ఉత్సాహం పెల్లుబికింది.

గభాలున లేచి గుమ్మం దగ్గరకు వచ్చిందావిడ.

"ఏమిటీ? ఒక్కనెల చేసావో లేదో జీతం పెంచమని అడుగుతున్నావు? బాగుంది నాయనా! రెండువేలు, మూడువేలు ఇచ్చేవాళ్లు వున్నారేమో గానీ మాకు వీలుకాదులే నాయనా. రేపటి నుండీ వేరే వాళ్ల దగ్గర పని చూసుకో. అదీకాక ఈ నెల పదిహేనురోజులు మేము ఊళ్లో ఉండము కూడా'' అనేసిందావిడ.

"మంచిదమ్మా'' అంటూ వెళ్లిపోయాడు డ్రైవరు వరదరాజులు.

"మనం ఊరు వెడుతున్నామా? ఎక్కడికి? ఎప్పుడు?'' ఆశ్చర్యంగా అడిగారు మంగపతిగారు.

"అబ్బా! మీరు మరీ అమాయక చక్రవర్తులండీ. ఏదో వాడిని వదిలించుకోవడం కోసం అన్నాను'' అందావిడ విజయోత్సాహంతో చిరునవ్వు చిందిస్తూ.

"ఎంతయినా ఘటనాఘటన సమర్థురాలివే సుమా. పోనీలే రేపటి నుండి ప్రొద్దున్న, సాయంత్రం డ్రైవరుకి పని చూపించడం కోసమే తప్పనిసరిగా బయటకు వెళ్ళే బాధ తప్పింది'' అంటూ తేలికగా నిట్టూర్చారు మంగపతిగారు.

ఆ తరువాత మాత్రం అప్పుడప్పుడు "ఇంతకీ మంగమ్మగారికి కారు డ్రైవరు సరదా తీరినట్టేనా?'' అంటూ భార్యను ఆట పట్టించడం మొదలుపెట్టారు.

ఆవిడ మాత్రం ముసిముసిగా నవ్వి "చాల్లేండి'' అంటూ ముచ్చటగా మూతి విరవడం ఆయనకు ఎంతో ముచ్చటగా తోచి మంగమ్మగారి కారు డ్రైవరు ప్రహసనానికి మనసులోనే నవ్వుకునేవారు.

★

## ప్రశ్నాపత్రం

''అదేంటయ్యా! ప్రశ్నాపత్రం ఇవ్వకుండానే పరీక్ష రాస్తున్నావు?'' ఆశ్చర్యంగా అడిగాడు ఇన్విజిలేటర్ రవిని.

''అక్కర్లేదు సార్. నేను నిన్ననే దానిని బజార్లో కొనుక్కున్నాను'' అనేసి నాలిక కరుచుకున్నాడు.

## సర్టిఫికెట్

''నువ్వు బలహీనంగా వున్నావని నేను సర్టిఫికెట్ ఇవ్వాలా? ఎందుకు?'' ఆశ్చర్యంగా అడిగాడు డాక్టర్ పేషెంట్‌ని.

''బలహీనవర్గాలకు లోన్లు ఇస్తారట కదా. అందుకని?'' చెప్పాడా పేషెంట్.

–కె.చంద్రకళ (చెన్నై)

## ఇంజెక్షన్

''మీ అబ్బాయిని కుక్క కరిచిందిటగా. ఇంజెక్షన్ చేయించారా?'' అడిగింది సుమిత్ర, కామాక్షిని.

''ఎందుకూ? వాడికేం కాదు''

''చిన్నప్పుడే మంచి ఇంజెక్షన్లు చేయించారు కాబోలు కుక్క కరిచినా ఏం కాకుండా.''

''అదేంకాదు. వాడికి పసితనంలో మా ఆడబిడ్డ ఆడుకుంటూ కరిచింది. మేం కంగారుపడ్డాంగానీ ఏం కాలేదు. అప్పుడే అనుకున్నాం ఇంక ఎలాంటి విషమూ ఎక్కదని'' ధీమాగా చెప్పింది కామాక్షి.

–వసుపులేటి సాయిలక్ష్మి (నెల్లూరు)

